సాక్షి నిజామాబాద్

మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024

7



కోడ్‌తో నగదు కష్టాలు

పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజలు నగదు కష్టాలు పడుతున్నారు. రూ. 50వేలకు మించి తీసుకెళ్లేందుకు జంకుతున్నారు.

- 8లో ▸



ఐక్య కార్యాచరణ పేరుతో..

ఐక్య కార్యాచరణ పేరుతో గల్ఫ్ కార్మికుల సమస్యను కొన్ని సంఘాలు రాజకీయం చేస్తున్నాయని కోటపాటి ఆరోపించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
43.4 /29.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూంల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలీస్ వజ్ ఆర్ పరిశీలించారు. అలాగే ఎన్నికల సిబ్బందికి సామాగ్రి అందజేసే డిస్ట్రిబ్యూషన్ స్థలాన్ని పరిశీలించారు. ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట మాక్లూర్ తహసీల్దార్ షబ్బీర్, ఏసీపీ బస్వారెడ్డి, ఎస్‌హెచ్‌వో రవికుమార్ తదితరులున్నారు.

రేపటి నుంచి టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు

నిజామాబాద్‌అర్బన్: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 42 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల వారు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు కోర్సుకు అర్హులన్నారు. ఇదివరకే దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు కోటగల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలన్నారు.

నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు

నిజామాబాద్‌అర్బన్: నేడు పదో తరగతి ఫలితాలు వెలువడనున్నాయి. పరీక్ష మార్చి 18 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 22,194 మంది పరీక్షలు రాశారు. నేడు ఉదయం 11 గంటలకు పరీక్ష ఫలితాలు విడుదల కానున్నాయి.

ఉమ్మడి జిల్లా ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఎన్నిక



కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె.బన్సీలాల్, కోశాధికారిగా రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా ఎస్.జ్యోతి, ఎన్.కృష్ణ, ఈ.రవీంద్ర మోహన్, సహాయ కార్యదర్శులుగా ఎం.గౌతమి, యు.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా కిషోర్‌గౌడ్, వసంత్‌కుమార్, మధుసూదన్ ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి డాక్టర్ జి.సుజాత ప్రకటించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

- బస్టాండ్‌లో ఓటర్ల అవగాహనపై ఫొటో ఎగ్జిబిషన్



ఖలీల్‌వాడి : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సీబీసీ ఆధ్వర్యంలో మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజంలోని విద్యావంతులు, ప్రజలు ఓటు విలువ తెలుసుకొని, ప్రజాస్వామ్య పద్ధతిలో నిజాయితీగా ఓటువేయాలని సూచించారు. కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మ నాయక్, ఆర్‌ఎం జానీరెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ సురేష్ కుమార్, డీడబ్ల్యూవో ఎస్‌కే రసూల్‌బీ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ శైలి బెల్లాల్, డిప్యూటీ ఆర్‌ఎం శంకర్ నాయక్ పాల్గొన్నారు.

నేడు మోదీ సభ

సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం మెదక్ జిల్లా అల్లాదుర్గంలో నిర్వహించే జనసభలో పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభకు పార్టీ నేతలు, నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల మధ్యలో నిర్వహించే సభకు 1.50 లక్షల జన సమీకరణ చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



2019లో పసుపు బోర్డు సాధనలో భాగంగా వారణాసిలో నామినేషన్లు వేయడానికి వెళ్లిన ఆర్మూర్ ప్రాంత పసుపు రైతులు (ఫైల్)

ఢిల్లీని తాకిన ఉద్యమ సెగ

- 2019లో వారణాసిలో నామినేషన్ల దాఖలు
- చరిత్ర సృష్టించిన పసుపు రైతులు
- పసుపు బోర్డును జాతీయస్థాయి అంశంగా మార్చేలా ఉద్యమం
- పార్టీల ఎజెండాలు, ఎన్నికల ఫలితాలను నిర్దేశించిన ఇందూరు కర్షకులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వ్యవసాయ రంగంలో అభివృద్ధి పథంలో ఉన్న ఇందూరు ప్రాంత రైతులు, తమ డిమాండ్ల సాధన కోసం అనేక ఉద్యమాలు చేసి జాతీయస్థాయిలో సంచలనం సృష్టించారు. తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి సుదీర్ఘ ఉద్యమాలు చేయడమే కాదు.. బ్యాలెట్ పోరుకూ సై అన్నారు. పసుపు బోర్డు అంశంపై దేశం దృష్టిపడేలా పోరాటాలు చేశారు. తమ గళాన్ని కేంద్ర ప్రభుత్వానికి వినిపించేందుకు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా ప్రధాని మోదీపైనే వారణాసిలో నామినేషన్లు వేశారు. ఎన్నికల్లోనూ రైతుల సమస్యలు, డిమాండ్లే ఎజెండాగా ప్రధాన పార్టీలు ముందుకెళ్లే పరిస్థితిని తెచ్చారు. రైతుల్లోని బలమైన డిమాండ్‌ను గమనించిన ధర్మపురి అర్వింద్ 2019 ఎన్నికల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి విజయం సాధించారు. ఎట్టకేలకు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీతో ప్రకటన చేయించారు. అంతలా పార్టీల ఎజెండాలు, ఎన్నికల ఫలితాలను సైతం శాసించేస్థాయిలో ఉద్యమాలు నడిపిన చరిత్ర ఇందూరు ప్రాంత రైతుల సొంతం.



వారణాసిలో 711 ఓట్లు సాధించిన పసుపు రైతు ఇస్తారి

కాంగ్రెస్‌ను దెబ్బతీసిన ఎర్రజొన్నల వివాదం..

ఇక 2008లో ఆర్మూర్ ప్రాంతంలో ఎర్రజొన్న విత్తనాల కొనుగోలు వ్యవహారంలో ఎగిసిపడిన ఆందోళనలు 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యాయి. ఎర్రజొన్నల సీడ్ వ్యాపారితో 2008లో అప్పటి కలెక్టర్ రామాంజనేయులు సమక్షంలో చేసుకున్న అధికారిక ఒప్పందం కారణంగా మోసపోయిన రైతులు ఉద్యమం చేసి ప్రభుత్వం నుంచి తమకు అనుకూలంగా జీవో విడుదల చేయించడంలో సఫలమయ్యారు. కానీ ఆ జీవోను పూర్తిస్థాయిలో అమలు పరచడంలో అధికారులు విఫలమయ్యారు. ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన పోలీసు కేసులతో రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడ్డారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలోని 108 గ్రామాల రైతులు అవస్థలు పడ్డారు. ఎర్రజొన్నల బకాయిల సాధన కోసం అఖిలపక్షంగా ఏర్పడి ఆరు రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన రాజకీయ పార్టీల నేతలు తరువాత కాలంలో బకాయిల చెల్లింపునకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి.

12 ఏళ్ల పాటు చెప్పులు లేకుండా..

మోర్తాడ్ మండలం పాలెంకు చెందిన రైతు ముత్యాల మనోహర్‌రెడ్డి పసుపు బోర్డు వస్తేనే చెప్పులు వేసుకుంటానని శపథం చేశారు. 2011 నవంబర్ 4 నుంచి చెప్పులు లేకుండా తిరిగిన ఆయన పసుపు బోర్డుకు ప్రధాని మోదీ ప్రకటన చేయడంతో చెప్పులు వేసుకున్నారు.

నాడు వారణాసికి వెళ్లి.. ఎన్నికల బరిలో నిలిచి..

2019లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన ఇందూరు రైతులు మరోవైపు ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ నియోజకవర్గం బరిలోకి దిగేందుకు తరలివెళ్లారు. పసుపు బోర్డు అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ప్రణాళికతో 54 మంది వారణాసికి వెళ్లారు. వివిధ కారణాల వల్ల 54 మందిలో 25 మంది రైతులు నామినేషన్లు వేయగలిగారు. వీరిలో 24 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా ఇస్తారి అనే రైతు ఒక్కడే పోటీలో నిలిచాడు. సదరు రైతులకు 711 ఓట్లు వచ్చాయి.

2019 ఎన్నికల్లో కవితను ఓడించి..

2019 ఎన్నికల ముందు పసుపు బోర్డు ఏర్పాటు, ఎర్రజొన్నల మద్దతు ధర కోసం రైతులు సుదీర్ఘకాలం అనేక ఉద్యమాలు చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్ల ఎదుట ధర్నాలు, ఆందోళనలు, రోడ్లపై రాస్తారోకోలు, జాతీయ రహదారుల దిగ్బంధం, వంటావార్పులు, ఆమరణ నిరాహార దీక్షలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతులు, గల్లీ నుంచి ఢిల్లీ దాకా నిరసన కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో నిరసనగా నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన 178 మంది రైతులు నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత సిట్టింగ్ ఎంపీ అభ్యర్థిగా ఉన్న సమయంలో భారీగా నామినేషన్లు వేస్తే సమస్య తీవ్రత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వెళ్తుందని.. తద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావించిన రైతులు నామినేషన్ల దాఖలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నాటి ఎన్నికల్లో 185 మంది అభ్యర్థులు బరిలో ఉండగా అందులో 178 మంది రైతులే కావడం విశేషం. రైతుల పోటీ చేయడంతో సిట్టింగ్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఓటమి పాలైంది. పసుపు బోర్డు తెస్తానని రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అర్వింద్ బీజేపీ తరపున విజయం సాధించారు.

బరిలో 29 మంది అభ్యర్థులు



అభ్యర్థులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- నామినేషన్లు ఉపసంహరించుకున్న ముగ్గురు అభ్యర్థులు
- అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించిన అధికారులు

సుభాష్‌నగర్ : నామినేషన్ల ఉపసంహరణకు గడువు సోమవారంతో ముగిసిపోగా, నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మొత్తం 42 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, స్క్రూటినీలో 10 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎన్నికల బరిలో 29 మంది అభ్యర్థులు నిలిచారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వివరించారు. స్వతంత్ర అభ్యర్థులు ముత్యం రఘు, పోతు నాగార్జున్, పోతు రవి తమ నామినేషన్లను వాపస్ తీసుకున్నారని తెలిపారు.

అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి భేటీ

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో ఈసీ మార్గదర్శకాలను అనుసరిస్తూ అభ్యర్థుల పేర్లు, అధికార తెలుగు భాష వర్ణమాల ప్రకారంగా క్రమసంఖ్య, గుర్తులు కేటాయించారు. ఈ సందర్భంగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు భేటీ అయ్యారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ కొనసాగిన నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియల్లో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్డీవో రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది 12 రోజులే..

అభ్యర్థుల ప్రచారానికి మరో 12 రోజులే ఉండడంతో ఇక అభ్యర్థుల ప్రచారం మరింత హోరెత్తనుంది. మే 11 సాయంత్రం 5 గంటల వరకే ప్రచారానికి ఈసీ అనుమతించింది. 12 రోజుల్లో ఏడు నియోజకవర్గాలను చుట్టేసేలా అభ్యర్థులు, పార్టీ నాయకులు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇదివరకే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో కార్యకర్తలు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కార్నర్ సమావేశాలు నిర్వహించారు. మే13న పోలింగ్ ఉంటుంది. ఓటర్లను ప్రలోభ పెట్టకుండా అభ్యర్థులు, పార్టీ నాయకులపై ఈసీ గట్టి నిఘా పెట్టింది.

జహీరాబాద్‌లో 19 మంది..

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ స్థానంలో మొత్తం 40 మంది అభ్యర్థులు, 64 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 14 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 19 మంది మిగిలారు. ప్రధాన పార్టీలనుంచి బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్ బరిలో ఉన్నారు.

అభ్యర్థులు వీరే..

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచిన 29 మంది అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. అర్వింద్ ధర్మపురి (బీజేపీ), బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్‌ఎస్), జీవన్ రెడ్డి తాటిపర్తి (కాంగ్రెస్), పుప్పాల లింబాద్రి (బీఎస్పీ), అబ్బగోని అశోక్ గౌడ్ (బహుజన లెఫ్ట్ పార్టీ), అలీ మన్సూర్ (అన్నా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ), కండెల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గుయ్య సాయి కృష్ణమూర్తి (యుగ తులసి పార్టీ), గోలి నరేష్ (దళిత బహుజన పార్టీ), దేవతి శ్రీనివాస్ (బహుజన ముక్తి పార్టీ), భూక్యా నందు (విద్యార్థుల రాజకీయ పార్టీ), మొగిలి రాజ్‌కుమార్ (ఇండియా ప్రజా బంధు పార్టీ), యోగేందర్ గట్ల (అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా ఆరె రాజేందర్, కొత్తకొండ శక్తిప్రసాద్, కోటగిరి శ్రీనివాస్, గంట చరితా రావు, గోపి చంద్రయ్య, టుటుకూరు జీవన్ రెడ్డి, దేశబోయిన లక్ష్మీనారాయణ, బీబీ నాయక్, పాలమూరు సాయి నిఖిల్, ప్రశాంత్ కత్రాజి, మాలావత్ విఠల్, రాగి అనిల్, రాపల్లి సత్యనారాయణ, రాపెల్లి శ్రీనివాస్, వేముల విక్రమ్ రెడ్డి, సయ్యద్ అస్గర్.

కాంగ్రెస్ హయాంలోనే వ్యవసాయాభివృద్ధి

- ఎత్తిపోతల పథకాలతో సాగునీరందించి రైతులకు అండగా..
- నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే వ్యవసాయాభివృద్ధి జరిగిందని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్‌లో సోమవారం నిర్వహించిన మున్నూరు కాపు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్మూర్ ప్రాంతానికి సాగునీరందిస్తున్న గుత్ప ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. వ్యవసాయ రుణాల మాఫీ, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు, పంటలకు గిట్టుబాటు ధర కాంగ్రెస్ హయాంలోనే సాధించారన్నారు. అంతకు ముందు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, నాయకులు గోర్తె రాజేందర్, సంజయ్ సింగ్ బబ్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, లింగ గౌడ్, తాటి హన్మాండ్లు పాల్గొన్నారు.

ఇందూరు గడ్డపైనే పసుపు బోర్డు

బాల్కొండ: ఇందూరు గడ్డపైనే పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం రాత్రి మెండోరా, ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటు ఎక్కడా అని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఇందూరులో ఏర్పాటవుతుందని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు కాలేదని కొందరు తప్పుడు కావాలని ప్రచారం చేస్తున్నారన్నారు. పసుపుబోర్డు ఏర్పాటు కాకపోతే కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి చిన్నాన్న ముత్యాల మనోహర్ పాద రక్షలు ఎందుకు ధరించారన్నారు. భవిష్యత్తులో పసుపు ధర రూ. 35వేలు పలికినా ఆశ్చర్య పోనక్కర్లేదన్నారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో జీవన్‌రెడ్డి రైతులకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మేలు చేయదని.. చేసేవారిని చేయనివ్వదని మండిపడ్డారు. నరేంద్ర మోదీ ఎన్నికల కోసం పాకులాడే వ్యక్తి కాదన్నారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీలపై జీవన్‌రెడ్డి స్టాండ్ ఏంటో చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలన వల్లనే దేశ ప్రజలు గల్ఫ్ బాట పట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అలాంటి పార్టీ నాయకులు గల్ఫ్ కార్మికుల సమస్యల కోసం పోరాగతామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అబద్ధపు హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో ఐపీఎఫ్ అధ్యక్షుడు జితేందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, నాయకులు సాయన్న, సంతోష్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా మెండోరాలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

‘రాయితీ’కి నేడే ఆఖరు

- ఆస్తిపన్నులో ఐదు శాతం మినహాయింపు
- ఏప్రిల్ 30లోగా చెల్లించిన వారికే వర్తింపు
- నగర కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు రూ. 9.95 కోట్ల వసూలు
- ఆర్మూర్‌లో రూ. కోటీ 54 లక్షలు మాత్రమే..

నిజామాబాద్‌నాగారం/ఆర్మూర్: మున్సిపాలిటీల్లో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికోసం ఇచ్చిన ఐదు శాతం రాయితీ పథకం నేటితో ముగియనుంది. 2024–25 ఆర్థిక సంవత్సరం పను చెల్లించే వారికి అవకాశాన్ని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు కల్పించిన విషయం తెలిసిందే. రాయితీ కల్పించడంతో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నాటికి రూ. 9.95 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఒకే రోజు గడువు ఉండడంతో మరో రూ. కోటి వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో ఆర్‌ఐ, బిల్ కలెక్టర్లు, ఇతర అధికారులు ఇంటింటికి తిరుగుతూ రిబేట్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆస్తి పన్ను వసూలు చేశారు. ఇప్పటి వరకు 14,190 మంది రూ. 9.95 కోట్లు ఆస్తి పన్ను చెల్లించారు. గతేడాది ఒక్క నెలలో రూ. 9 కోట్లు వసూలు కాగా.. ఈ ఏడాది అంతకుమించి వసూలైంది.



ఇక ఆర్మూర్ మున్సిపాలిటీలో మొత్తం 5,189 మంది రూ. కోటి 54 లక్షలు మాత్రమే ప్రజలు పన్ను చెల్లించారు. మంగళవారం ఒక్క రోజే అవకాశం ఉండడంతో మ రికొంత మంది చెల్లించే అవకాశం ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 5.94 కోట్లు వసూలు చేయా ల్సి ఉండగా.. రూ.4.54కోట్లు వసూలయ్యాయి. అ యితే రాయితీ మంగళవారం చివరి రోజు కావడంతో అవకాశాన్ని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

“అందరి శ్రమతోనే సాధ్యమైంది

మున్సిపల్ శాఖ ఇంటి పన్ను చెల్లింపునకు ఐదు శాతం రిబెట్ అవకాశం కల్పించింది. రెవెన్యూ అధికారులు, సిబ్బంది శ్రమించడంతో ఒక్క నెలలో రూ. 9.95 కోట్ల ఆదాయం వచ్చింది. చివరి రోజు మరో రూ. కోటి వరకు ఆస్తి పన్ను వచ్చే అవకాశం ఉంది. నగర ప్రజలు ఐదు శాతం రిబెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్, నిజామాబాద్ కార్పొరేషన్

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటి పన్ను చెల్లింపుదారులు ఐదు శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటికే కార్యక్రమంపై పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాం. మంగళవారం చివరి రోజు కావడంతో ప్రజలు పన్ను చెల్లించాలి.

– రాజు, కమిషనర్, ఆర్మూర్ మున్సిపాలిటీ

ఉద్యోగుల సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి
- బ్రాంచ్ మేనేజర్లకు సన్మానం

సుభాష్‌నగర్: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో గతేడాది కంటే ఈ మార్చి నాటికి డిపాజిట్లలో పెరుగుదల, ఎన్‌పీఏలో తగ్గింపు బ్యాంకు ఉద్యోగుల సమష్టికృషితోనే సాధ్యమైందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని నిజామాబాద్ సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ 7.35శాతం ఉత్తమ ఫలితాలు అందించిన బ్రాంచ్ మేనేజర్లకు సన్మానం చేశారు. ఈసందర్భంగా 12 మంది బ్రాంచ్ మేనేజర్లను సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధిలో పాలకవర్గం, ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఎన్‌పీఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటీఎస్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించి చైతన్యపర్చాలని సూచించారు. బ్యాంకు మార్కెట్ షేర్ పెరిగేందుకు అవసరమైన సూచనలను సీఈవో నాగభూషణం వందే వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మేనేజర్లను సన్మానిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

మే 6న జిల్లాకు కేసీఆర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మే 6న నిజామాబాద్‌కు రానున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా చేపట్టాల్సిన ర్యాలీ రూట్ మ్యాప్, పలు మీటింగ్ స్థలాలు, వివిధ పార్కింగ్ స్థలాలు వాటి సాధ్యాసాధ్యాలను ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ పరిశీలించారు. వారి వెంట జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 1613 మందికిగాను 1468 మంది హాజరుకాగా, 145 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 769 మందికిగాను 695 మంది పరీక్షలు రాయగా 74 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఓపెన్ పదో తరగతిలో హిందీ పరీక్షకు 83 మందికిగాను 78 మంది, ఇంటర్ ఫిజిక్స్ పరీక్షకు 392 మందికిగాను 362 మంది హాజరయ్యారు.

పీజీ సెమిస్టర్స్..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ నాల్గో సెమిస్టర్, ఐఎంబీఏ పదో సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఒకటో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 358 మంది విద్యార్థులకు గాను 331 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఫీజు చెల్లింపునకు మే7 వరకు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును మే 7వ తేదీవరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2023 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి) 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ.100 అపరాధ రుసుము తో మే 8 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఏఎస్ పోశెట్టి

ఖలీల్‌వాడి: బీడీ కాంట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఏఎస్ పోశెట్టి ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మహేశ్‌కుమార్‌గౌడ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, జావీద్ అక్రమ్ పాల్గొన్నారు.

కూచిపూడిలో శ్రీనిధికి జాతీయస్థాయి అవార్డు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని దేవునిపల్లి మధురానగర్‌కు చెందిన కాసం శ్రీనిధి గోవాలో స్నేహ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి 'నేషనల్ ఐకాన్' అవార్డును అందుకుంది. గోవా మడ్‌గావ్ రవీంద్రభారతిలో ఆల్ ఆర్ట్ ఫామ్స్ పేరిట ఈనెల 26 నుంచి 29 వరకు నృత్యపోటీలు నిర్వహించగా, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీనిధి కూచిపూడిలో ప్రతిభను కనబర్చింది. నిజామాబాద్ నటరాజ రామకృష్ణ కళాక్షేత్రం నిర్వాహకులు రచ్చ నరేశ్ వద్ద శ్రీనిధి నృత్య శిక్షణ పొందింది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మూడురోజుల జైలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా మెదక్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రతాప్ అతడిని మూడు రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

ఎన్నికల కోడ్‌తో నగదు కష్టాలు

- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇక్కట్లు
- జిల్లాలో రూ. 1.01 కోట్లు పట్టివేత



నస్రుల్లాబాద్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు (ఫైల్)

ఖలీల్‌వాడి: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రూ. 50 వేల నగదుతో బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. బ్యాంకుల నుంచి డబ్బు లు తీసినా, వేయడానికి వెళ్లినా పోలీసులు ఎక్కడ పట్టుకుంటారోనని బెంబేలెత్తుతున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పోలీసులు, ఫ్లయింగ్‌స్క్వాడ్స్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. పోలీసుల తనిఖీలు, ఎన్నికల అధికారుల తనిఖీలలో నగదు పట్టుబడుతోంది. పట్టుబడిన డబ్బులలో ఎక్కువగా వ్యాపారులకు సంబంధించినవి ఉన్నాయి. వ్యాపారులు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకువెళ్లుతున్న సమయంలో నగదు పట్టుకున్న ఘటనలు జిల్లాలో ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు రూ. 1,01,63, 367 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పార్టీల నగదును పట్టుకున్న దాఖలాలు లేవు

జిల్లాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద పోలీసులు, ఎక్సైజ్, ఎన్నికల అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటి వరకు పార్టీలకు సంబంధించిన నగదును పట్టుకున్న దాఖలాలు లేవు. వ్యాపారులు, సామాన్య ప్రజలకు సంబంధించిన నగదే దొరికింది. రోడ్లపైన కారులు, వాహనాదారులను తనిఖీలు చేస్తున్నారు. రాజకీయ నాయకుల కదిలికలపై దృష్టి సారిస్తే పెద్ద మొత్తంలో నగదు లభించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాన్య, వ్యాపారులకు సంబంధించిన నగదును సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్నికలు ఇంకా 13 రోజులు ఉండటంతో రాజకీయ నాయకులు ఎన్నికలలో గెలుపొందేందుకు నగదు, మద్యం తరలించి ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి బీజీగా ఉన్నారనే ప్రచారం ఉంది.

దొరికిన నగదు ట్రెజరీలో జమ

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రూ. 50 వేల కంటే ఎక్కువగా తీసుకురావడానికి వీలు లేదు. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు దొరికితే ట్రెజరీలో జమ చేస్తారు. అలాగే 10 లక్షల కంటే ఎక్కువ ఉంటే ఆదాయపన్నుల శాఖ నోడల్ అధికారులు తెలియజేస్తారు. ఈ నగదుకు సంబంధించిన ఆధారాలను ఎన్నికల అధికారులకు అందిస్తే పరిశీలించిన తర్వాత వాటిని బాధితుడికి అందజేస్తారు. జిల్లాలో ఎన్నికల అధికారులకు నగదు వివరాలను అందిస్తే వాటిని పరిశీలించి, ఇవి నిజమైన ఆధారాలుగా భావించి వాటిని తిరిగి ఇచ్చే అవకాశం ఉంటుంది. లేకుంటే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

ఎంపీ అర్వింద్‌కు గల్ఫ్‌కార్మికుల బహిరంగ లేఖ

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ కార్మికుల ఓట్లు అడిగే ముందు అరవింద్ ధర్మపురి తమ ప్రశ్నలకు జవాబు చెప్పాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఏం చర్యలు తీసుకున్నదని ప్రశ్నించారు. గల్ఫ్‌దేశాల్లో పనిచేసే 88లక్షల మంది కార్మికుల జీవితాలకు సంబంధించిన వేతనాల అంశంపై ఎందుకు స్పందించలేదని, హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, కువైట్ దేశాల కాన్సులేట్ల (దౌత్య కార్యాలయాలు) ఏర్పాటు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు చొరవ చూపడం లేదన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని హోదాలో సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, కువైట్, ఖతర్, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాల్లో చాలాసార్లు పర్యటించి వ్యాపార, వాణిజ్య ఒప్పందాలే చేసుకున్నారని, గల్ఫ్ వలస కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమం గురించి ఎందుకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో విదేశాల నుంచి తిరిగి వచ్చిన వారి నుంచి మూడింతల విమాన చార్జీలు వసూలు చేసిన బీజేపీ ప్రభుత్వం కార్మికులను దోచుకున్నదన్నారు. 'దుబాయిలో మన వాళ్లు చేతికి కంకణం కట్టుకొని, నుదుట తిలకం దిద్దుకొని తిరుగుతున్నారంటే దానికి నరేంద్రమోదీ కారణం' అని ఇటీవల అర్వింద్ వ్యాఖ్యానించడం ఘోర తప్పిదమన్నారు. సర్వస్వతంత్ర, సార్వభౌమాధికారం కలిగిన దుబాయి (యూఏఈ దేశం) పై భారత్ ఆధిపత్యం చలాయిస్తున్నది అనే అర్థం వచ్చేలా మాట్లాడటం దౌత్య నిబంధనలకు విరుద్ధమని దీనిపై జవాబు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఇలా పలు అంశాలపై ప్రశ్నించిన గుగ్గిల్ల రవిగౌడ్. ఎంపీ అర్వింద్ జవాబు చెప్పాలని కోరారు.

ఐక్య కార్యాచరణ పేరుతో రాజకీయం



మాట్లాడుతున్న కోటపాటి నర్సింహనాయుడు

ఆర్మూర్: ఐక్య కార్యాచరణ పేరుతో గల్ఫ్ కార్మికుల సమస్యను కొన్ని సంఘాలు రాజకీయం చేస్తున్నాయని ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు ఆరోపించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గల్ఫ్ బాధితుల పక్షాన 15 సంవత్సరాలుగా తాము ఉద్యమాలు చేస్తున్నామన్నారు. నాడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికుల పక్షాన ఏ ఒక్క చర్య చేపట్టలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న జీవన్‌రెడ్డి మంత్రిగా పనిచేసిన సమయంలో ఏనాడూ గల్ఫ్ బాధితుల పక్షాన నిలబడలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సైతం గల్ఫ్ కార్మికుల సమస్యను నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతులు, గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా దేశ గౌరవాన్ని పెంచిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మూడో పర్యాయం గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో ప్రవాస భారతీయు ల సంక్షేమ, హక్కుల వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను మే 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు క్రీడల అధికారి ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 10 క్రీడా అంశాల్లో శిబిరాలు కొనసాగనున్నాయి. తిమ్మాపూర్ జడ్పీ స్కూల్‌లో పీఈటీ శ్యామ్ బాల్‌బ్యాడ్మింటన్, వేల్పూర్ మినీ స్టేడియంలో సీనియర్ క్రీడాకారుడు సాయిరామ్ బాస్కెట్‌బాల్, దాస్‌నగర్‌లోని నవ్యభారతి స్కూల్‌లో పీఈటీ అజ్మత్ హ్యాండ్‌బాల్ శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, మిట్టాపల్లి జెడ్పీ స్కూల్‌లో పీఈటీ గంగామోహన్ సాఫ్ట్‌బాల్, సిరికొండలోని సత్యసాధన పాఠశాలలో సీనియర్ క్రీడాకారుడు సంతోష్ బేస్‌బాల్, మోతెలో పీఈటీ ప్రేమ్‌జ్యోతి హాకీ, చీమన్‌పల్లి జెడ్పీ స్కూల్‌లో పీఈటీ వినోద్‌నాయక్ కబడ్డీ, ఢీకంపల్లిలో సీనియర్ క్రీడాకారుడు ఖోఖో, మాదాపూర్ పాఠశాలలో పీఈటీ వెంకటేశ్‌గౌడ్ వాలీబాల్, తాడ్‌బిలోలి జెడ్పీ స్కూల్‌లో పీఈటీ వెంకటేశ్వర్‌రావు నెట్‌బాల్ శిక్షణ ఇవ్వనున్నట్లు ముత్తెన్న వివరించారు.

హైదరాబాద్ తరలిన శనగ రైతులు

డొంకేశ్వర్: పంటను విక్రయించి రెండు నెలలు కావొస్తున్న ఇంత వరకు ధరను నిర్ణయించి తమకు డబ్బులు ఇవ్వలేదని నిజామాబాద్, నిర్మల్ జిల్లాల శనగ రైతులు సోమవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. అక్కడ సీడ్ కార్పొరేషన్ ఎండీకి వినతి పత్రాన్ని అందజేశారు. క్వింటాలుకు కనీసం రూ.7,500 తగ్గకుండా ఇవ్వాలని ఎండీని కోరారు. లేదంటే తాము విక్రయించిన సరుకును తిరిగి ఇచ్చేయాలన్నారు.

క్రైం కార్నర్

మలేషియాలో కోటాల్‌పల్లివాసి మృతి



అకుల రమేశ్(ఫైల్)

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన ఆకుల రమేశ్(45) గుండెపోటుతో మలేషియాలో మృతి చెందాడు. బతుకుదెరువుకోసం రమేశ్ గత 20 ఏళ్లుగా గల్ఫ్ దేశాలకు వెళ్తున్నాడు. కొద్దిరోజులపాటు గ్రామంలోనే ఉండి వ్యవసాయ పనులు చేసిన రమేశ్.. వారం రోజుల క్రితమే మలేషియాకు వెళ్లాడు. అక్కడ పరిస్థితి బాగాలేకపోవడంతో మలేషియాలోనే ఉంటున్న గ్రామానికి చెందిన బాలకృష్ణతో కలిసి స్వగ్రామానికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. శనివారం ఇండియాకు బయల్దేరిన రమేశ్ ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో మృతి చెందాడు. బాలకృష్ణ ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కువైట్‌లో కలిగోట్ వాసి ఆత్మహత్య



అముదాల హరీశ్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్‌కు చెందిన అముదాల హరీశ్‌గౌడ్(29) కువైట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. బతుకుదెరువు కోసం రెండున్నరేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లిన హరీశ్‌గౌడ్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మార్చి 22న ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సమీప బంధువైన సత్యంగౌడ్, దుబాయ్ జీడబ్ల్యూఏసీ అధ్యక్షుడు రవి, కువైట్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, మాజీ అధ్యక్షుడు వాజిద్ సహకారంతో హరీశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు. సోమవారం హరీశ్ అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు.

అడవి పందులను బైక్ ఢీకొని ఒకరి మృతి



గంగారాం (ఫైల్)

మాచారెడ్డి: అడవి పందులను బైక్ ఢీకొట్టిన ఘటనలో మండలంలోని సోమారంపేటకు చెందిన నునావత్ గంగారాం(42) అనే వ్యక్తి మృతి చెందాడు. గంగారాం గ్రామానికి చెందిన అమర్‌సింగ్‌తో కలిసి ఆదివారం రాత్రి బైక్‌పై సోమారంపేటకు వెళ్తుండగా అడవి పందులు అడ్డువచ్చాయి. ఈ ఘటనలో గంగారాం తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో అమర్‌సింగ్ చేయి విరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

సైకిల్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో..

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన హరిశంకర్ మృతి చెందాడు. పొతంగల్ మండల శివారులోని మంజీర నది రెండో బ్రిడ్జి సమీపంలో హరిశంకర్ సైకిల్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. సీఐ జయేశ్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడిని మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకా నరేంగల్ గ్రామానికి చెందిన హరిశంకర్‌గా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు అప్పలపాలయ్యాడని ఆత్మహత్య

బాల్కొండ: కొడుకు అప్పుల పాలయ్యాడని మనస్తాపానికి గురైన వృద్ధురాలు ఎస్సారెస్పీ వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కిసాన్‌నగర్‌కు చెందిన పాతకాల సాయమ్మ(70) తన కుమారుడు ప్రవీణ్ అప్పులపాలయ్యాడని మదనపడుతుండేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి వరదకాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కుటుంబ సభ్యుల మరణాలను తట్టుకోలేక..

బాల్కొండ: అనారోగ్యం కారణంగా భర్త, కుమారుడు, కుమార్తె వరుసగా చనిపోవడాన్ని తట్టుకోలేక ముప్కాల్‌కు చెందిన రుక్మాబాయి(59) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై భాస్కరాచారి తెలిపారు. కుటుంబ సభ్యుల మరణాలతో తీవ్రమానసిక ఒత్తిడికి లోనైన రుక్మాబాయి కోడలు వద్ద ఉంటోంది. మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పుల కారణంగా సోమవారం ఉదయం ముప్కాల్‌లోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక భారాన్ని మోయలేక..

బోధన్‌రూరల్: ఆర్థికభారాన్ని మోయలేక మండలంలోని కల్దుర్కికి చెందిన బి.అనురాధ(30) ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. భర్త పనిచేయకపోవడం, మద్యానికి బానిసకావడంతో అనురాధ కుటుంబ భారాన్ని మోస్తోంది. ఈ క్రమంలో ఆర్థికభారాన్ని మోయలేక మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తమ్ముడు సచిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసికంగా కుంగి..

డొంకేశ్వర్(ఆర్మూర్): భర్త మరణంతో మానసికంగా కుంగిపోయి మండలంలోని నూత్‌పల్లికి చెందిన మంగ్లారం ఉమ(26) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఏడేళ్ల క్రితం ఉమకు సురేశ్‌తో పెళ్లికాగా, కూతురు పుట్టిన కొన్నినెలలకే భర్త మరణించాడు. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన ఉమ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసైన వ్యక్తి..

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రానికి చెందిన మహాదేవ్ చంద్రకాంత్ గిరి (26) మద్యానికి బానిసై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొంతకాలంగా సిద్దిపేటలో ఉంటున్న చంద్రకాంత్ గిరి ఈ నెల 26న సాలూరకు వచ్చి మరుసటి రోజు గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు.

రైలుకు ఎదురెళ్లి యువకుడి ..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి రైలుకు ఎదురెళ్లి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి ఒంటిపై బ్లూ కలర్ జీన్స్, వైట్ షర్ట్ ఉన్నాయన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 58591 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బోధన్‌లో పోలీసు కవాతు



బోధన్‌టౌన్(బోధన్): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే చర్యల్లో భాగంగా పోలీసులు, సీఆర్‌పీఎస్ బృందాలు సోమవారం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ ఆజాంగంజ్, బీటీ నగర్, ఉద్మీర్‌గల్లీ, రెంజల్ బేస్, పాత బస్టాండ్, శక్కర్‌నగర్ చౌరస్తా మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. పట్టణ సీఐ వీరయ్య, రూరల సీఐ నరేశ్‌తోపాటు పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బృందాలు పాల్గొన్నాయి.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల చెరువులో చేపలవేటకు వెళ్లిన మీసాల సాయిలు(54) ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ధర్పల్లి మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన సాయిలు కొంతకాలంగా డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం చేపలవేటకు వెళ్లిన అతడి నీటిలో మునిగి మృతి చెందాడు. సోమవారం ఉదయం పోలీసులు స్థానికుల సాయంతో చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లికి చెందిన రైతు నీల రాజయ్య(53) సోమవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామ శివారులోని లక్కాకుల భూమయ్యకు చెందిన వ్యవసాయభూమిని కౌలుకు తీసుకుని పంట సాగుచేస్తున్న రాజయ్య, వరి కోతకోసం హార్వెస్టర్‌ను తీసుకువచ్చాడు. దాని కోసం విద్యుత్‌వైర్లను తొలగించి, మళ్లీ సరి చేస్తుండగా షాక్ తగిలింది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువు కట్టకింద వ్యవసాయ క్షేత్రంలోని బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 45-50 మధ్య ఉంటుందన్నారు. మృతుడిని ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మృతురాలి గుర్తింపు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆదివారం లభించిన మృతదేహం చాకలి బుర్రి కీర్తన(19)గా గుర్తించారు. ఈ మేరకు ట్రెయినీ ఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. మృతురాలి భర్త బుర్రి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఏడుగురిపై పిచ్చి కుక్క దాడి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో దారివెంట వెళ్తున్న వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసింది. బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది చికిత్స చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

తాడ్వాయి/లింగంపేట(ఎల్లారెడ్డి): ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. తాడ్వాయి మండలం క్రిష్ణాజివాడి శివారులో, లింగంపేట మండలం గాంధీనగర్ మూలమలుపు వద్ద సోమవారం ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. క్రిష్ణాజీవాడికి చెందిన తొడెంగల స్వామి తన భార్యశైలజతో కలసి పింఛన్ తీసుకోవడానికి బైక్‌పై శివారులోని గుడికి వెళ్తుండగా, చిన్నమల్లారెడ్డికి చెందిన సురేశ్ అనే వ్యక్తి బైక్‌పై కామారెడ్డి నుంచి క్రిష్ణాజివాడికి వస్తున్నాడు. ఈ క్రమంలోఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధితులను పరామర్శించారు.

మోహన్‌రెడ్డి అనే వ్యక్తి బైక్‌పై కామారెడ్డి నుంచి ఆత్మకూర్‌కు వెళ్తుండగా, కొయ్యగుండు తండా నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న బన్సీఅనే వ్యక్తి బైక్‌లు లింగంపేట మండలంలోని గాంధీనగర్ వద్ద మూలమలుపు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయాలపాలైన ఇరువురిని పోలీసులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

టాటా ఏస్ బోల్తాపడిన ఘటనలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం టాటాఏస్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ గ్రామానికి చెందిన రాజమ్మ, ఎల్లయ్య దంపతులు బంధువులతో కలిసి మెట్‌పల్లిలో శుభకార్యానికి వెళ్తుండగా, అర్గుల్ శివారులో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కుప్పను ఢీకొన్న ఘటనలో..

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను బైక్ ఢీకొన్న ఘటనలో అమృతాపూర్‌కు చెందిన కుందేటి శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఆదివారం డిచ్‌పల్లి ఖిల్లాలోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన శ్రీకాంత్ రాత్రికి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వినయ్

వేల్పూర్: నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను వేల్పూర్ ఎస్సై వినయ్ వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం సిబ్బందితో కలిసి వెంకటపూర్ రోడ్డులో పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బైక్‌ను ఆపి తనిఖీ చేయగా 2 కిలోల 100గ్రాముల గంజాయి పట్టుబడింది. నిర్మల్‌కు చెందిన సయ్యద్ అజీమ్, షేక్ అద్నాన్ సోహెల్ మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది విజయ్, సందీప్, శ్రావణ్, భరత్ పాల్గొన్నారు .

పింఛన్ కోసం వస్తూ..



అంజవ్వ (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బైక్ అదుపు తప్పిన ఘటనలో చిన్న దేవాడకు చెందిన కుర్మ అంజవ్వ మృతి చెందింది. కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న అంజవ్వ పింఛన్ కోసం సోమవారం కొడుకు బైక్‌పై వస్తుండగా, ఎలకంటి చెరువు సమీపంలో ప్రమాదం జరిగింది. అంజవ్వ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, ఆమె కుమారుడు యాదిగొండకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి కూతురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

పింఛన్ తీసుకొని వెళ్తూ..

ఎడపల్లి(బోధన్): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో మండలంలోని ఠానాకలాన్‌కు చెందిన మెట్టు భూమయ్య(60) మృతి చెందాడు. ఈ ఘటన ఎమ్మెస్సీ ఫారం వద్ద చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీ అయిన భూమయ్య టీవీఎస్ మోపెడ్‌పై ఎడపల్లికి వచ్చి పింఛన్ తీసుకొని వెళ్తుండగా, నిజామాబాద్ వైపు నుంచి అతివేగంతో వచ్చిన కారు ఎమ్మెస్సీ ఫారం వద్ద ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన భూమయ్య ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కొడుకు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.